క్లుప్తంగా

వికలాంగుల హక్కుల జాతీయ వేదిక గ్రామ కమిటీ ఎన్నిక

బోధన్: వికలాంగుల హక్కుల జాతీయ వేదిక సాలంపాడ్ గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం సాలూర మండలంలోని సాలంపాడ్, సాలంపాడ్ క్యాంప్ గ్రామాలకు సంబంధించిన కమిటీ ఎన్నిక కోసం సభ్యులు సమావేశమయ్యారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా రాంపటేల్, ఉపాధ్యక్షుడిగా సాయిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎం.సాయిలు, సహాయ కార్యదర్శిగా రాములు, కోశాధికారిగా ఎల్లయ్య, సభ్యులుగా మల్లమ్మ, లక్ష్మి, మంగమ్మలను ఎన్నుకున్నట్లు వేదిక జిల్లా గౌరవ అధ్యక్షుడు యేశాల గంగాధర్ తెలిపారు.

ఉచితంగా రక్త పరీక్షలు



ఆర్మూర్‌టౌన్: మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో గంగ ఆస్పత్రి వైద్యుడు అమృత్‌రాంరెడ్డి ఆధ్వర్యంలో ఆర్మూర్ ప్రెస్ క్లబ్, నవనాథపురం ప్రెస్ క్లబ్ సభ్యులకు ఉచితంగా రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు నెమలి ప్రశాంత్, మంచిర్యాల నరేందర్ మాట్లాడుతూ.. జర్నలిస్టుల బాగు కోసం డాక్టర్ అమృత్‌రాంరెడ్డి ఎలాంటి రుసుము లేకుండా ఉచితంగా 71 రకాల రక్త పరీక్షలు నిర్వహించడం అభినందనీయమన్నారు. వారికి కృతజ్ఞతలన్నారు.

డెంగీ వ్యాధి నివారణ మాత్రల పంపిణీ



ఆర్మూర్: పట్టణంలోని రాజారాంనగర్, కెనాల్ కట్ట ప్రాంతంలో లయన్స్ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ నవనాథపురం ఆధ్వర్యంలో ఉచితంగా హోమియోపతి డెంగీ నివారణ మాత్రలు పంపిణీ చేశారు. వైద్యులు దివ్యభారతి, హరీష్ మాత్రలను అందజేసి తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. ఒక్కొక్క మాత్ర కిట్టు రూ.100 ఉంటుందని, మొత్తం 120 మందికి ఉచితంగా అందజేశామన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు చెరుకు పృధ్వీరాజ్, ప్రాజెక్ట్ చైర్మన్ కొంగి మనోహర్, ద్యాగఉదయ్, అంబల్ల తిరుపతి, శశిధర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే వ్యాధులు దూరం



ఆర్మూర్‌టౌన్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచినట్లయితే సీజనల్ వ్యాధులు దరిచేరవని జర్నలిస్టుకాలనీ అధ్యక్షుడు సుంకే శ్రీనివాస్ అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని జర్నలిస్టుకాలనీలో కాలనీ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం స్వచ్ఛ కాలనీ, సమైక్య కాలనీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా కాలనీల్లో పెరిగిపోయిన పిచ్చిమొక్కలను తొలగించారు. వర్షాకాలంలో మురికికాలువల్లో చెత్త వేయవద్దని అన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉంటూ వ్యాధులకు గురికాకుండా చూసుకోవాలన్నారు. కాలనీ సభ్యులు కొక్కెర భూమన్న, కమలాకర్, రాజు, సతీష్, గణేష్, రాజ్‌కుమార్, సాయన్న తదితరులు పాల్గొన్నారు

మొహర్రం ఉత్సవాలు



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో మొహర్రం పండుగ ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. గ్రామంలో ఐదు రోజుల పాటు ఉత్సవాలను నిర్వహించనున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అన్నదానం చేశారు. నిర్వాహకులు సాజిద్, అలీ సాబ్, ఖాదర్, హుస్సేన్, దిలీప్, మదర్, సతీష్, యువకులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే రాక

నందిపేట్(ఆర్మూర్): నందిపేట మండల కేంద్రానికి సోమవారం ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి వస్తున్నట్లు మండల బీజేపీ అధ్యక్షుడు భూతం సాయిరెడ్డి తెలిపారు. నందిపేటలోని రైతు వేదికలో కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేస్తారని తెలిపారు. అలాగే గ్రామాలలో బాధిత కుటుంబాలను పరామర్శిస్తారని తెలిపారు. మండలంలోని నాయకులు పాల్గొనాలని కోరారు.

శివాలయంలో గాజుల పూజ

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలోని నవనాథ సిద్ధుల గుట్టపై గల శివాలయంలో సోమవారం గాజుల పూజ నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. అలాగే స్వామివారి ఉత్సవ విగ్రహాలకు ఆలయ పరిసర ప్రాంతాల్లో పల్లకిసేవ నిర్వహిస్తున్నట్లు కమిటి సభ్యులు పేర్కొన్నారు.

ఆగిన మార్కెట్ నిర్మాణం

- ప్రభుత్వం నుంచి నిధులు రాకపోవడంతో చేతులెత్తేసిన కాంట్రాక్టర్
- ఇబ్బందులు పడుతున్న వ్యాపారులు, కొనుగోలుదారులు



పెర్కిట్‌లో పిల్లర్ల దశలో నిలిచిపోయిన మార్కెట్ నిర్మాణ పనులు

పెర్కిట్(ఆర్మూర్) : గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులకు నిధులు నిలిచిపోవడంతో నిర్మాణాలు అర్ధాంతరంగా ఆగిపోతున్నాయి. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణానికి గత ప్రభుత్వ హయాంలో బీజం పడింది. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం సమీకృత మార్కెట్ నిర్మాణానికి ప్రత్యేక నిధుల నుంచి రూ.7 కోట్ల 20 లక్షలు మంజూరు చేసింది. దీంతో 44వ నెంబరు జాతీయ రహదారి పక్కన శిథిలావస్థకు చేరుకున్న ఆర్‌అండ్‌బీ శాఖ కార్యాలయంతో పాటు అతిథి గృహాన్ని కూల్చి వేసి అదే స్థలంలో మార్కెట్ నిర్మాణానికి మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి అసెంబ్లీ ఎన్నికలకు ముందు పనులను ప్రారంభించారు. మొదట్లో పనులు వేగంగా జరిగినా ప్రభుత్వం మారడంతో నిధులు నిలిచిపోయి పనులు ఆగిపోయాయి. ప్రస్తుతం పనులు పుట్టింగ్ దశలో ఉన్నాయి. నిధులు రాకపోవడంతో కాంట్రాక్టరు చేతులెత్తేశాడు. దీంతో మార్కెట్ ఏర్పాటుపై నమ్మకం పెట్టుకున్న రైతులు, వ్యాపారులు నిరాశకు గురవుతున్నారు. పెర్కిట్ గ్రామం కూరగాయలు, చేపల మార్కెట్‌కు ప్రసిద్ధి. ప్రస్తుతం మార్కెట్‌ను 44వ నెంబరు జాతీయ రహదారి పక్కన నిర్వహిస్తున్నారు. గ్రామం 44, 63వ నెంబరు జాతీయ రహదారులకు కూడలిగా ఉండడంతో ఆర్మూర్‌తో పాటు సమీప బాల్కొండ, వేల్పూర్, జక్రాన్‌పల్లి మండలాలకు చెందిన రైతులు తాము పండించిన కూరగాయలను ఇక్కడ విక్రయిస్తారు. అలాగే వ్యాపారులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి కూరగాయలను దిగుమతి చేసుకుని హోల్‌సేల్ వ్యాపారం చేస్తుంటారు. దీంతో మార్కెట్ నిత్యం కూరగాయల వ్యాపారులు, కొనుగోలుదారులతో రద్దీగా ఉంటుంది. మార్కెట్‌లో ఎలాంటి సౌకర్యాలు లేవు. షెడ్డు సైతం లేకపోవడంతో రైతులు, వ్యాపారులు ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ కూరగాయలు విక్రయిస్తున్నారు. తైబజార్ ద్వారా రూ.లక్షల్లో ఆదాయం పొందుతున్న మున్సిపల్ శాఖ ప్రస్తుత ఉన్న మార్కెట్‌లో ఎలాంటి సౌకర్యాలు ఏర్పాటు చేయడం లేదు. ప్రస్తుతం మున్సిపాలిటీకి తై బజార్ ద్వారా తొమ్మిది నెలలకు రూ.22 లక్షల 86 వేలు ఆదాయం సమకూరుతున్నా మార్కెట్‌లో ఎలాంటి వసతులు కల్పించడం లేదు. ప్రభుత్వం అర్ధాంతరంగా నిలిచిపోయిన మార్కెట్ నిర్మాణానికి నిధులు విడుదల చేసి పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలని రైతులు, వ్యాపారులు కోరుతున్నారు.

త్వరగా పూర్తి చేయాలి

సమీకృత మార్కెట్ నిర్మాణం ప్రారంభించి 8 నెలలు గడుస్తున్నా పనులు ముందుకు సాగడం లేదు. పనులను త్వరగా పూర్తి చేసి మార్కెట్‌ను అక్కడికి తరలించాలి. ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని నిర్మాణం త్వరగా పూర్తయ్యేలా చూడాలి. – లలిత, కూరగాయల వ్యాపారి, పెర్కిట్

నిధులు రాగానే పనులు చేపడుతాం

ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాకపోవడంతో కాంట్రాక్టరు పనులు నిలిపివేశాడు. నిధులు విడుదల కాగానే పనులు జరిపించేలా చర్యలు తీసుకుంటాం. – రాజు, మున్సిపల్ కమిషనర్, ఆర్మూర్

కార్యకర్తలకు బీజేపీ అండగా ఉంటుంది



చిక్కడపల్లిలో బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే లక్ష్మీనారాయణ

రుద్రూర్: చిక్కడపల్లిలో బాధిత కుటుంబాలను ఆదివారం బాన్సువాడ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ పరామర్శించారు. చిక్కడ గ్రామానికి చెందిన బీజేపీ కార్యకర్త సాయికుమార్ రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. మండల బీజేపీ ఉపాధ్యక్షుడు ఎర్రోల్ల శంకర్ సతీమణి రేణుక ఇటీవల మృతి చెందారు. బాధిత కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే ఓదార్చారు. అధైర్య పడొద్దని పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. నాయకులు వి.రామ్‌రాజ్, కృష్ణం రాజు, ఎర్రోల్ల గంగాధర్ తదితరులున్నారు.

పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలి



ఆర్మూర్‌టౌన్ : మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు ప్రజలు తోడ్పడాలని ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో రవికుమార్ అన్నారు. పట్టణ పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆదివారం పర్యావరణ పరిరక్షణలో భాగంగా సీఐ రవికుమార్, సామాజిక సేవకుడు పట్వారి తులసి కుమార్‌తో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎస్‌హెచ్‌వో రవికుమార్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ వర్షాకాలంలో మొక్కలను ఇళ్ల లేదా ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాల ఆవరణలో నాటాలని కోరారు. అలాగే పట్వారి తులసి వ్యక్తిగతంగా దేశ శ్రేయస్సుకు ఉపయోగపడే ఆలోచనలతో ముందుకు వెళ్లడం అభినందనీయమన్నారు.

పోడు రైతుల సంతకాల సేకరణ



చందూర్‌లో సంతకాలు సేకరిస్తున్న పోడు భూముల సాధన కమిటీ సభ్యులు

వర్ని(చందూర్) : పోడు భూమిని సాగు చేసుకొని జీవిస్తున్న గిరిజనేతర నిరుపేద పోడు రైతులకు ప్రభుత్వం పట్టాలు ఇవ్వాలని కోరుతూ, పోడు భూముల సాధన కమిటీ నాయకులు చందూర్ బస్టాండ్ ప్రాంతంలో ఆదివారం తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా పోడు భూముల సాధన కమిటీ కన్వీనర్ నన్నేసాబ్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి నిరుపేద పోడు రైతులకు పట్టాలిచ్చి ఆదుకోవాలని కోరారు. పోడు రైతులు సాయిబాబా, వెంకన్న, సాయిలు, శ్రీను, హన్మాండ్లు, సాయి, అబ్బయ్య, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

బైక్ ర్యాలీ జయప్రదం చేయాలి



రుద్రూర్: రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించి తొలిసారిగా బాన్సువాడ పట్టణానికి వస్తున్న కాసుల బాలరాజుకు ఘన స్వాగతం చెప్పడానికి సోమవారం ఏర్పాటు చేసిన బైక్ ర్యాలీ కార్యక్రమానికి మండలంలోని పార్టీ కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తోట అరుణ్ కుమార్ కోరారు. రుద్రూర్ మండల కేంద్రంలో ఆదివారం ఆయన మాట్లాడారు. ర్యాలీ అనంతరం ఎస్ఎంబీ ఫంక్షన్ హాల్‌లో కాసుల బాలరాజుకు అభినందన సభ, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళన సభ ఉంటుందని పేర్కొన్నారు. సమావేశంలో మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు నడిపింటి నగేష్, నేతలు మాశెట్టి శ్రీనివాస్, పార్వతి ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం..

ఘనంగా బోనాల పండుగ



రుద్రూర్: అంబం(ఆర్)లో ఆదివారం బోనాల పండగ ఘనంగా జరుపుకున్నారు. గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో బోనాల ఊరేగింపు నిర్వహించారు. పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. గ్రామ దేవతలకు నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

పోతంగల్ మండల కేంద్రంలో...

పోతంగల్(రుద్రూర్): పోతంగల్‌లో ఆదివారం ఆషాఢ మాస బోనాల పండగ వైభవంగా జరుపుకున్నారు. కుల సంఘాల ఆధ్వర్యంలో బోనాలతో ఊరేగింపు నిర్వహించి పోచమ్మ తల్లికి నైవేద్యం సమర్పించారు. పూజలు నిర్వహించారు. ప్రతి ఏడాది ఆషాఢ మాసంలో బోనాల పండగ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని గ్రామ పెద్దలు పేర్కొన్నారు.

ఏఆర్పీ క్యాంప్‌లో..

ఎడపల్లి(బోధన్): ఏఆర్పీ క్యాంప్‌లో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పెద్దమ్మ తల్లికి బోనాలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. గ్రామంలోని ప్రధాన వీధులలో బోనాలను ఊరేగించారు. అనంతరం దేవాలయంలో బోనాలను పెద్దమ్మ తల్లికి సమర్పించారు. కుల సంఘం నాయకులు పోల్కస్వామి, భాగయ్య, వెంకటి, నర్సింలు, రవి కుమార్, శ్రీనివాస్, గోపి, తదితరులు పాల్గొన్నారు.

చందూర్, వర్ని, మోస్రాలలో..



వర్ని: ఉమ్మడి వర్ని మండలంలోని చందూర్, మోస్రా, వర్ని మండలాల్లో బోనాల పండుగను ఆయా గ్రామాల్లో ప్రజలు ఘనంగా నిర్వహించారు. పాడి పంటలు సమృద్ధిగా పండి ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకుంటూ ప్రజలు బోనాల పండుగను నిర్వహించారు.

బినోలలో ..

నవీపేట: బినోల గ్రామంలో నల్ల పోచమ్మ బోనాల పండుగను ఆదివారం గ్రామస్తులు ఘనంగా జరుపుకున్నారు. గ్రామంలోని గ్రామ దేవతలకు పూజలు చేశాక నల్ల పోచమ్మ ఆలయానికి బోనాలతో వచ్చి నైవేద్యాలు సమర్పించారు.



గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నల్లపోచమ్మ ఆలయంలో భక్తులు ఆషాఢ మాసం సందర్భంగా ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా సర్వసమాజ్ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు.

కొత్తపల్లిలో..



బాల్కొండ: ముప్కాల్ మండలం కొత్తపల్లి గ్రామంలో ఆదివారం గ్రామ దేవతలకు జలాభిషేకం నిర్వహించారు. ఈసందర్భంగా పవిత్ర గోదావరికి కాలినడకన వెళ్లి గంగ నీళ్లను తీసుకొచ్చారు. అనంతరం గ్రామంలో డప్పు వాయిద్యాలతో, వల గొడుగుతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఆలయాల్లో జలాభిషేకాలు చేశారు.

కనుల పండువగా జగన్నాథ రథయాత్ర



బోధన్‌టౌన్(బోధన్): నీలాద్రి భక్త బృందం ఆధ్వర్యంలో ఆదివారం జగన్నాథ రథయాత్ర బోధన్ పట్టణంలో కనుల పండువగా సాగింది. పట్టణంలోని అనీల్ టాకీస్ రోడ్డులో నీలాద్రి భక్త బృందం ప్రతినిధులు రథానికి ప్రత్యేక పూజలు నిర్వహించి రథయాత్రను ప్రారంభించారు. ఈ రథయాత్ర కొత్త బస్టాండ్, అంబేడ్కర్ చౌరస్తా మీదుగా టీటీడీ కల్యాణ మండపం వరకు సాగింది. భక్తులు రథాన్ని లాగుతూ జగన్నాథుని నామస్మరణ చేశారు. ఏసీపీ శ్రీనివాస్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు రవీందర్ యాదవ్, భక్తులు పాల్గొన్నారు.

ఏజీపీని సన్మానించిన కాంగ్రెస్ నాయకులు



బోధన్‌టౌన్(బోధన్): బోధన్ కోర్టులో ఏజీపీగా నియమితులైన సీనియర్ నాయకులు మహ్మద్ గౌసొద్దీన్‌ను ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వారి నివాసానికి వెళ్లి ఘనంగా సన్మానించారు. ఏజీపీని సన్మానించిన వారిలో కౌన్సిలర్ తూము శరత్ రెడ్డి, మీర్ నజీర్ అలీ, ఇమ్రాన్, పట్టణ ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి ప్రమోద్ ఉన్నారు.

మౌలాలి దర్గాకు ఊర కందూరు



రెంజల్(బోధన్): యాభై ఏళ్లుగా ఆనవాయితీగా వస్తున్న ఊర కందూరు వేడుకను గ్రామస్తులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని కోరుతూ మండలంలోని తాడ్‌బిలోలి గ్రామస్తులు మౌలాలితండాలోని మౌలాలిదర్గాకు ప్రతి సంవత్సరం కందూరు నిర్వహిస్తారు. గ్రామం నుంచి డప్పు వాయిద్యాలతో వచ్చి దర్గాలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మలీదాను చేసి ప్రసాదంగా పంచిపెట్టారు. గ్రామ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సామూహిక భోజనాలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ సుధాకర్‌రావ్, మాజీ సర్పంచ్ గంగాధర్, మాజీ ఎంపీటీసీలు నర్సయ్య, లక్ష్మీ, శ్రీనివాస్, మాజీ విండో చైర్మన్ సాయరెడ్డి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వంతెన మరమ్మతుకు చర్యలు

వేల్పూర్: లక్కోర వద్ద 63వ నంబరు జాతీయ రహదారిపై గత ఏడాది భారీ వరదలకు కుంగిపోయిన వంతెనకు మరమ్మతులు చేసేందుకు చర్యలు చేపట్టారు. వంతెన కుంగిన భాగాన్ని తొలగిస్తున్నారు. గత ఏడాది జూలై 24న భారీ వర్షం కురియడంతో వరద నీటి ఉధృతికి వంతెన కొంతభాగం కుంగిపోయింది. దాంతో జాతీయ రహదారి అధికారులు దెబ్బతిన్న చోట అడ్డుగోడ నిర్మించడంతో రాకపోకలు కష్టంగా సాగుతున్నాయి. వంతెన ఇరుకుగా ఉన్న విషయం తెలియక చాలా సార్లు ప్రమాదాలు జరిగాయి. పెర్కిట్ నుంచి జగిత్యాల మీదుగా మంచిర్యాల వరకు 63 నంబరు జాతీయ రహదారి విస్తరణకు కేంద్ర ప్రభుత్వ నిర్ణయించింది. ఇందులో భాగంగా దెబ్బతిన్న వంతెనను బాగు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు.



లక్కోర వద్ద మరమ్మతులు చేస్తున్న వంతెన

గౌడ సంఘం ఆధ్వర్యంలో సునీల్‌రెడ్డికి సన్మానం



సునీల్‌ను సన్మానిస్తున్న గౌడ సంఘం నేతలు

వేల్పూర్: మండల కేంద్రంలో ఆదివారం గౌడ సంఘం ఆధ్వర్యంలో బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి ముత్యాల సునీల్‌కుమార్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఆషాఢ మాసం బోనాల కార్యక్రమానికి ఆయనను ముఖ్య అతిథిగా ఆహ్వానించారు. తమ కులదైవమైన రేణుకాఎల్లమ్మ ఆలయంలో ఆయనను సన్మానించారు. దీనికి ముందు గీత కార్మికులు రేణుకా ఎల్లమ్మకు ఆషాఢ మాసం బోనాలు నిర్వహించారు. అంబేడ్కర్ చౌరస్తా నుంచి ఆలయం వరకు బోనాలతో ఊరేగింపు నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేసి వనభోజనాలు ఆరగించారు. సంఘ పెద్ద మనుషులు సుంకెట శ్రీనివాస్‌గౌడ్, అబ్బగోని జగదీశ్వర్‌గౌడ్, పడాల శ్యాంసుందర్‌గౌడ్, దొమ్మేటి వెంకటేశ్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రంగు అనిల్ గౌడ్, బద్దం హరికిషన్ తదితరులు పాల్గొన్నారు.

ఆయకట్టు రైతుల ప్రయోజనాలను కాపాడుతాం



కాకతీయకాలువ యూటీని పరిశీలిస్తున్న సునీల్‌రెడ్డి

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ ఆయకట్టు రైతుల ప్రయోజనాన్ని కాపాడుతామని బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్ రెడ్డి అన్నారు. ఆదివారం మెండోరా మండల కేంద్ర శివారులో కాకతీయ కాలువ అండర్ టన్నెల్(యూటీ)కి ఏర్పడిన గండి మరమ్మతులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాకతీయ కాలువ యూటీకి గండి ఏర్పడి నీటి ప్రవాహానికి అంతరాయం ఏర్పడిందన్నారు. ప్రభుత్వంతో మాట్లాడి యూటీ గండి మరమ్మతు పనులను వేగంగా పూర్తి చేశామన్నారు. ప్రాజెక్ట్ అధికారులు ప్రతిపాదనలు చేసే వరకు వేచి చూస్తే ఆయకట్టు రైతులకు నీరు అందక ఇబ్బంది పడతారని గ్రహించి స్థానిక కాంట్రాక్టర్‌తో మాట్లాడి పనులు చేయించామన్నారు. పనులు సకాలంలో పూర్తి చేసేలా కృషి చేయడం ఆనందంగా ఉందన్నారు. రెండు రోజుల్లో కాకతీయ కాలువ ద్వారా అన్నదాతలకు అవసరమైన టీకేజీ నీటిని వదులుతారన్నారు. ముప్కాల్, మెండోరా మండలాల అధ్యక్షులు ముత్యంరెడ్డి, కొత్తింటి ముత్యంరెడ్డి, డీసీసీ డెలిగేట్ జైడి రవి, కిసాన్ ఖేత్ జిల్లా ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, తదితరులు ఉన్నారు.

చిట్టాపూర్ లిఫ్టు పనులు ప్రారంభించేలా చర్యలు



వినతి పత్రం అందజేస్తున్న చిట్టాపూర్ గ్రామస్తులు

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి నీటిని సరఫరా చేయడానికి మంజూరైన చిట్టాపూర్ లిఫ్టు నిర్మాణ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు ఆదివారం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌రెడ్డికి మోర్తాడ్ మండల కేంద్రంలో వినతి పత్రం అందజేశారు. లిఫ్టు నిర్మాణ పనులు నిలిచిపోవడంతో గ్రామ రైతుల్లో ఆందోళన పెరిగిందన్నారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటానని సునీల్‌రెడ్డి హామీచ్చారు. వీడీసీ సభ్యులు లింగన్న, రాజారాం, తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛత పక్వాడ



బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలో స్థానిక భారత్ పెట్రోల్ బంక్ ఆధ్వర్యంలో ఆదివారం స్వచ్ఛత పక్వాడ-2024 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా జాతీయ రహదారి-44పై చెత్త, పిచ్చి మొక్కలను తొలగించారు. జూలై 1 నుంచి 15 వరకు పరిసరాల పరిశుభ్రత కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. సోమవారం వివిధ పాఠశాలలో వ్యాసరచన పోటీలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పెట్రోలియం సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 –	డెస్పికబుల్ మీ-4 (తెలుగు) - 11.40, 2.00, 4.20, 6.40, 9.00
స్క్రీన్-2 –	కల్కి -2898ఏడీ (3డీ తెలుగు) - 10.45, 2.30, 6.15, 10.00
స్క్రీన్-3 –	కల్కి -2898ఏడీ (తెలుగు) - 10.00, 1.45, 5.30, 9.15
స్క్రీన్-4 –	కల్కి-2898ఏడీ (తెలుగు) - 11.30, 3.15, 7.00, 10.45

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 20764
90102 86628 (నిజామాబాద్)
94920 10949 (బోధన్, బాన్సువాడ)
95055 08389 (ఆర్మూర్)
Office mail : nzbadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
నిజామాబాద్ అర్బన్ & రూరల్ రాంనాథ్ : 7997958181
ఆర్మూర్ శివ : 9848956776
బాల్కొండ ప్రశాంత్ : 8919850800
బోధన్ కృష్ణ : 7997958178
టోల్ ఫ్రీ నెం. 1800 425 9899